క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న మెడికవర్ వైద్యులు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ వి.ఆపీస్, వైస్ఎంపీపీ ఎల్.తులసీవరప్రసాద రావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు చైతన్య, మౌనిక సింగ్, బి.అన్నాజి, ప్రశాంత్ శ్యామ్‌ప్రసాద్‌తోపాటు పలువురు వైద్య సిబ్బంది సేవలు అందించారు. కొత్తూరు సీహెచ్‌సీ కమిటీ డైరెక్టర్ మండ రామ్మూర్తి పంతులు, పల్ల రామకృష్ణ, మాజీ సర్పంచ్ పి.వెంకటకృష్ణ, చల్ల ధర్మారావు పాల్గొన్నారు.

11న మండల సమావేశం

పాతపట్నం: ఈ నెల 11వ తేదీన మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. మండల అధికారులు, ఎంపీటీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: విత్తన శుద్ధివలన తెగుళ్లు, చీడపీడలు లేకుండా మంచి దిగుబడులు వస్తాయని ఏఈఓ రాము తెలిపారు. మండలంలోని అవతరాబాద్ గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల, ఏరువాక కేంద్రం శ్రీకాకుళం ఆధ్వర్యంలో బుధవారం విత్తన శుద్ధి కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు, మోతాదు గురించి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎడబ్ల్యూఈపీ విద్యార్థులు సుధాకర్, సూర్యనారాయణ, అహమ్మద్, ధనరాజ్ పాల్గొన్నారు.

అర్హత గల సంఘాలకు లింకేజీ రుణాలు



మాట్లాడుతున్న ఏసీ కొండలరావు

నరసన్నపేట: మండలంలో ఉన్న స్వయం శక్తి సంఘాల్లో అర్హత కలిగిన వాటికి లింకేజీ రుణాలు రెన్యువల్ చేయాలని, కొత్త సంఘాలకు రుణాలు కల్పించాలని ఏసీ కొండలరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సీసీ, సీఎఫ్‌లు, మండల మహిళా సంఘాల సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ మండలంలో సెర్ప్ నిబంధనల మేరకు ముందుగా పొదుపు నిధులను వినియోగించి అనంతరం లింకేజీ రుణా లు పొందాలన్నారు. వాడుకున్న, రుణాలు విధిగా వ్యాపారాభివృద్ధికి, పునర్ ఉత్పత్తికి వినియోగించాలన్నారు. రుణాలు పొందేవారు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. సంఘాల వ్యవహారాల్లో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. ఏపీఎంలు అప్పలరామయ్య, హేమసుందర్, కళావతి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సరుబుజ్జిలి: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ వెల్లడించారు. రొట్టవలసలోని బుడ్డెన్న చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులు బుధవారం తనిఖీ చేశారు. మస్టర్ల నమోదు, వేతనదారుల హాజరు పరిశీలించారు. రైతులకు ప్రయోజనమైన పనులు మాత్రమే చేయాలని సూచించారు.

భూ రికార్డుల శుద్ధీకరణతో రైతుకు మేలు

సారవకోట: భూ రికార్డుల శుద్ధీకరణతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తహసీల్దార్ ప్రవల్లికాప్రియ అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మపాడు సచివాలయ పరిధిలోని కొత్తూరు గ్రామంలో భూ రికార్డుల శుద్ధీకరణపై గ్రామ సభ నిర్వహించారు. ఈ పంచాయతీ పరిధిలో ఇప్పటికే రీ సర్వే పూర్తయిందని, త్వరలోనే రైతులకు పాస్‌పుస్తకాలు అందజేయనున్నామన్నారు. భూముల రీ సర్వే చేసి రైతుల నుంచి అభ్యర్థనలు తీసుకుని వాటిని పరిష్కరించి పూర్తి స్థాయిలో కొత్త రికార్డులు, పాస్‌పుస్తకాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ బాడాన కృష్ణారావు, వీఆర్వో కృష్ణారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మూడున్నరేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని గ్రామ సచివాలయ-3 పరిధిలోని శివశంకర్ కాలనీలోని పలు వీధుల్లో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖను లబ్ధిదారులకు అందజేశారు. జగనన్న ఇళ్లు కావాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరగా.. రెండో విడతలో జగనన్న కాలనీలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ సమస్యలను పరిష్కారిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాలకొండ మున్సిపల్ చైర్మన్ యందవ రాధాకుమారి, పాతపట్నం, మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరావు, ఉర్లాన బాలరాజు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, తాతయ్య, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఎం.గణపతి, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, తహసీల్దార్ కె.రవిచంద్ర, ఏపీఓ సురేష్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఏఓ అప్పలనాయుడు, ఈఓ కుర్మారావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, పార్టీ నాయకులు పనుకుమోహన్, సుధాకర్, శ్రీధర్, కృష్ణారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్పీకర్ పుట్టినరోజు



ఆమదాలవలస: కేక్ కట్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ఆమదాలవలసకు తరలివచ్చిన అభిమానులు
- కేక్ కట్ చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: స్పీకర్ తమ్మినేని సీతారాం పుట్టిన రోజును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమదాలవలస పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేపట్టారు. ఆమదాలవలస మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాలతోపాటు జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు స్పీకర్ క్యాంప్ కార్యాలయానికి చేరుకుని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. పార్టీ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పార్టీ నాయకుడు డాక్టర్ ధానేటి శ్రీధర్ స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సరుబుజ్జిలి: స్పీకర్ తమ్మినేని సీతారాం పుట్టినరోజు వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీలు శివానందమూర్తి, అనిల్, సచివాలయాల కో ఆర్డినేటర్ మూడడ్ల రమణ ఉన్నారు.



సరుబుజ్జిలి: స్పీకర్ తమ్మినేని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మండల నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ మదనాపురంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పుట్టిన రోజు వేడుకలు వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పీ.ఎల్.దేవిపేటలో ఎండీయూ గార హేమసుందరరావు స్పీకర్‌పై అభిమానంతో తన సొంత నిధులతో గ్రామంలోని వృద్ధులకు దుస్తులు పంచిపెట్టారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మండల సచివాలయం కన్వీనర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పుట్టిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఐహెచ్ఆర్ఏఐ రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామమోహనరావు కేక్ కట్‌చేశారు. ఐహెచ్ఆర్ఏఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, అల్లంశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బూర్జ: పీ.ఎల్.దేవిపేటలో దుస్తులు పంపిణీ చేస్తున్న మండల నాయకులు



పొందూరు: కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి, తదితరులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



వైద్యులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నరసన్నపేట: విద్యార్థి దశలో ఇంటర్‌మీడియెట్ చాలా కీలకమని నర్సింగ్ హోం నిర్వాహకులు డాక్టర్, కళాశాల పూర్వ విద్యార్థి గొలివి మోహన్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని బుధవారం ప్రిన్సిపాల్ నారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గొలివి పాల్గొని ప్రసంగించారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇదే కళాశాలలో చదువుకున్నట్లు తెలిపారు. మరో ముఖ్య అతిథి వైద్యుడు బలగ మురళి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదవాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి, పోలాకి కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణారావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావుతో పాటు పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పూర్వవిద్యార్థులు, ముఖ్య అతిథులుగా వచ్చిన వైద్యులకు కళాశాల తరపున ప్రిన్సిపాల్ సత్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు కొమనాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

జలుమూరు: కొమనాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం సాయంత్రం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కసుసు సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు పార్టీలోని అన్ని విభాగాల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. అలాగే సచివాలయ భవనం ప్రారంభం కూడా ఉంటుందన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

కొత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో గురువారం సాయంత్రం మూడు గంటలకు గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సచివాలయం మండల కన్వీనర్ కామక త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ పి.వి.వి.సూర్యనారాయణ రాజు హాజరవుతారన్నారు. మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలోని గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సారవకోట: ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ఆధార్ నమోదుకు ప్రస్తుతం సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

కొత్తూరు ఉప తహసీల్దార్‌కు బదిలీ

కొత్తూరు: కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.బాలకృష్ణను ఇచ్ఛాపురం మండలం ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా జిల్లా కలెక్టర్ బదిలీ చేసినట్లు తహసీల్దార్ పి.బాల బుధవారం చెప్పారు. ఇటీవల గ్రూప్-2 పరీక్షల్లో ఎంపికైన బి.వెంకటరమణను కొత్తూరు ఉప తహసీల్దార్ నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

లైసెన్స్‌లు తప్పనిసరి



నరసన్నపేట: ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ, వ్యవసాయ సిబ్బంది



పోలాకి: ఎరువుల దుకాణాల్లో రికార్డులు తనిఖీలు చేస్తున్న ఏడీఏ, ఏఓ చిరంజీవి



పాతపట్నం: ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ రాజగోపాల్

నరసన్నపేట/పోలాకి/పాతపట్నం: ఎరువుల వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్, జీఎస్టీ కలిగి ఉండాలని, రెన్యువల్ చేసుకోవాలని వ్యవసాయశాఖ రణస్థలం ఏడీఏ వి.శ్రీనివాస్ అన్నారు. జేడీ ఆదేశాల మేరకు బుధవారం నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఉన్న ఎరువుల షాపులను ఏఓలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ డీలర్‌కు చెందిన లైసెన్స్‌లు, జీఎస్టీ తనిఖీ చేశారు. పాతపట్నం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కొత్తూరు వ్యవసాయ ఉప సంచాలకులు (ఏడీఏ) బి.రాజగోపాల్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్, గిడ్డంగుల్లో ఉన్న నిల్వలు పరిశీలించారు. కాలం చెల్లిన లైసెన్స్‌లతో వ్యాపారం చేయకూడదన్నారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం నిల్వలు సరిపోవాలన్నారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, ఈ పాస్ నమోదు చేయాలని సూచించారు. అనుమతి లేని పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓలు సునిత, చిరంజీవి, రవికుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి సాయిగీత

మెళియాపుట్టి: క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉండేలా చూడాలని పాతపట్నం క్షయ నియంత్రణ యూనిట్ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. బుధవారం మండలంలోని చాపర, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకునేలా చూడాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారదార్థాలు తీసుకునేలా తెలియజెప్పాలని, క్షయ పరీక్షల నిర్వహణ పెంచాలని, వ్యాధిగ్రస్తులు భయపడకుండా అవగాహన కల్పించాలన్నారు. కఫం నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. చాపర డాక్టర్ పావని, మెళియాపుట్టి డాక్టర్లు అలేఖ్య, గ్రీష్మ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యాంత్రీకరణతో వ్యవసాయం సులువు



రైతులకు శిక్షణ ఇస్తున్న ప్రోగ్రాం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేయడం సులువుగా ఉంటుందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కేవీకేలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న యాంత్రీకరణ పద్ధతులు, యంత్రాల వినియోగం, మరమ్మతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలు యంత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఎస్.అనూష, నీలవేణి, కిరణ్‌కుమార్, బి.మౌనిక, పలు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

ఔదార్యం..

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన కర్రి పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఆరు నెలల కుమార్తె లాస్య ఉంది. లాస్యకు పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ సంస్థ అధ్యక్షుడు పి.రామరాజు స్వగ్రామంలో బుధవారం దోమతెర, ఆట వస్తువులను అందజేశారు. ఏడాది పాటు ఆవు పాలు ఇవ్వనున్నారు. తండ్రి వలస కూలీ కావడంతో చిన్నారి లాస్య అమ్మమ్మ కొంచాడ వెంకటమ్మ వద్ద ఉంటుందన్నారు. అంపోలు మన్మధరావు, కరక కరువులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలో లొద్దలపేట గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ సప్తమి వార్షికోత్సవ మహోత్సవాలు బుధవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మేల్కొపి విశేష పూజలు చేశారు. స్వామి వారిని నూతన వస్త్రాలు ఆలంకరించారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అదుపుతప్పిన ట్రాక్టర్లు



వెదుళ్లవలసలో ఇంట్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్

పోలాకి: మండలంలోని వేర్వేరు చోట్ల బుధవారం రెండు ట్రాక్టర్లు అదుపుతప్పాయి. వెదుళ్లవలసలో యారబాటి ప్రవీణకుమార్ ఇంటి గుమ్మం వరకు దూసుకుపోయిన ట్రాక్టర్‌ను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే డీఎల్‌పురం వద్ద అసర్లసాగరంలోకి మరొక ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. వెంటనే స్థానికుల సహాయంతో పైకితీశారు. ఈ రెండు ఘటనల్లో కూడా డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తుంది. మద్యం తాగి డ్రైవ్ చేయటం, ఇయర్ ఫోన్స్ పెట్టి పాటలు వినుకుంటూ వెళ్లటం వంటివి నియంత్రించాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

విద్యా బోధనలో వినూత్న పద్ధతులు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

ఎల్.ఎన్.పేట: ఉపాధ్యాయుడు చెప్పే పాఠం విద్యార్థులకు అర్థమయ్యేలా కొత్త పద్ధతులు పాటించాలని ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని రోటరీనగర్, తురకపేట సెంటర్‌లోని ఎస్.వి.స్కూల్, కోవిలాం వద్ద ఉన్న వెంకటసాయి పాఠశాలలను బుధవారం వార్షిక తనిఖీ చేశారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయల హాజరుపట్టి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలన్నారు. పరిశీలకులు పైడి రాజు, గురుగుబెల్లి శ్రీరామచంద్రమూర్తి, సీఆర్పీలు అచ్యుతరావు, తవిటినాయుడు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్

బూర్జ: భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేపట్టాలని శ్రీకాకుళం జేసీ నవీన్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పినివలస సచివాలయంలో పరిధిలో గల దేవనాపురంలో చేపడుతున్న భూముల రీ సర్వేను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేపట్టిన అనంతరం ఎఫ్.పి.ఒ.ఎల్.ఆర్‌లో భాగంగా రీ సర్వే చేపట్టాలన్నారు. రైతులు తమ పాస్ పుస్తకాలు తీసుకుని భూముల వద్దకు వెళ్లి సర్వే సిబ్బందికి సహరించాలన్నారు. తహసీల్దార్ ఎస్.రమణారావు, ఆర్ఐ వెంకటరమణ, వీఆర్వో రాజారావు, సర్వేయర్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల పంచాయతీ అధికారి జి.శ్యామలాదేవి అన్నారు. తురకపేట గ్రామ సచివాలయాన్ని బుధవారం పరిశీలించారు. శాఖల వారిగా పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని డిజిటల్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. గ్రామ సచివాలయం పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని, మార్చి ఆఖరు నాటికి శతశాతం వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్పంచ్ మొదవలస యోగీశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యదాయకమైన పంటలు పండుతాయని వ్యవసాయశాఖ అధికారి ధానకరకర్లుడు అన్నారు. మండలంలోని కొసమాలలో బుధవారం రైతులకు పలు నూతన పద్ధతులను వివరించారు. గ్రామానికి చెందిన రైతులు ధర్మారావు, హరిశ్చంద్రలకు చెందిన రెండెకరాల వరి పొలంలో రాగిలైన్ పద్ధతి ద్వారా విత్తనశుద్ధి చేయడాన్ని తెలియజేశారు. ఈ నారును నాటితే అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగానికి దూరం కావాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సూర్య, యమున, పీఆర్పీ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.